# పుష్పబాణవిలాసము

(మూలగ్రంథములోని శ్లోకములు, తదనురూపములైన
ఇతరగ్రంథములలోని శ్లోకములు, శ్లోకముల కన్నిటికి అర్థతాత్పర్యములు,
పద్యానువాదములు గల గ్రంథము)

అర్థతాత్పర్యాదుల రచయిత, పద్యానువక్త
**శ్రీకళాపూర్ణ డా. తిరుమల కృష్ణదేశికాచార్యులు**

ఎమెస్కో

# పుష్పబాణవిలాసము

శ్లో|| శ్రీమద్గోపవధూస్వయంగ్రహపరిష్వఙ్గేషు తుఙ్గస్తన
వ్యామర్దాద్గళితేఽపి చన్దనరజస్యఙ్గే వహన్ సౌరభమ్,
కశ్చిజ్జాగరజాతరాగనయనద్వన్ద్వః ప్రభాతే శ్రియం
బిభ్రత్కామపి వేణునాదరసికో జారాగ్రణీః పాతు వః|| ౧

ఉ. శ్రీయుత లున్నతస్తనులు వ్రేతలు దామె కవుంగిలింప నా
రాయిడిచేత వక్షమున రంజిలు గంధము రాలిపోయినం
బాయని మేనితావి గల వైణవికుండు, ప్రజాగరారుణా
బ్జాయతనేత్రుఁడై వరలు జారశిఖామణి మిమ్ముఁ బ్రోవుతన్. ౧

**అర్థము:** శ్రీమత్...పరిష్వఙ్గేషు – శ్రీమత్=సౌందర్యము గల్గిన, లేక శోభాయుతలైన, గోపవధూ=గోపికలయొక్క, స్వయంగ్రహ=తాముగా పైకొనునట్టి, పరిష్వఙ్గేషు= ఆలింగనములయందు; తుఙ్గస్తన=ఉన్నత స్తనములయొక్క, వ్యామర్దాత్=రాయిడివలన, చన్దనరజసి=గందపుఁబొడి, గళితేఽపి =రాలిపోయినను, సౌరభమ్=సువాసనను, అఙ్గే = (తన)దేహమునందు, వహన్=తాల్చియున్నవాఁడును, జాగర...ద్వన్ద్వః – జాగర=(రాత్రి) మేల్కొనుటచేత, జాత=కల్గిన, రాగ=ఎఱ్ఱదనముగల, నయనద్వన్ద్వః=కన్నుదోయి గలవాఁడును, ప్రభాతే=ఉదయమునందు, కామపి=ఇట్టిదని వర్ణింపనలవిగాని, శ్రియం=శోభను, బిభ్రత్= ధరించి యుండువాఁడును నైన, వేణునాదరసికః=వేణుగానమునందాసక్తుఁడగు, కశ్చిత్=ఒకానొక, జారాగ్రణీః =మేటి జారుఁడు (శ్రీకృష్ణుఁడు), వః=మిమ్ము, పాతు=రక్షించుఁగాక.

**తాత్పర్యము:** గ్రంథారంభమున కవి మంగళాచరణ మిట్లు చేయుచున్నాఁడు. 'శోభావంతులు, సుందరు లైన గోపికాకాంతలు తమంతట తామే వచ్చి కౌఁగిలించుకొనుటవలన నొదవిన వారి యున్నతస్తనముల రాయిడిచే తన శరీరమునందలి గంధపుఁబూత రాలిపోయినను తనుపరీమళము తఱుగనివాఁడును, (కేళీ మూలమున) రాత్రి నిదురలేమివలన ఎఱ్ఱనైన నేత్రములు గలవాఁడును, ప్రభాతమందు వర్ణనాతీతమైన శోభ గలవాఁడును,వేణునాదలోలుఁడును నైన ఒకానొక జారాగ్రణి (శ్రీకృష్ణుఁడు) మిమ్ములను రక్షించుఁగాక!'

**అలంకారములు:** ప్రేయోరసవదలంకారములు. విశేషోక్తి, పర్యాయోక్త్యలంకారము. 'పరిష్వజ్గేషు తుజ్గస్తన' అని ఉన్నచోట వృత్త్యనుప్రాసమను శబ్దాలంకారము.

**విశేషములు:** గ్రంథమును కవి శ్రీకారముతోఁ గూడిన మగణముతో ఆరంభించినాఁడు. ఇట్టి ఆరంభము కవికిని, కావ్యపఠితలకును శుభప్రదమగుమని ఛందశ్శాస్త్రము. తరువాతి శ్లోకములో చెప్పినట్లుగా శృంగార రసప్రధానమైన కావ్యమును వ్రాయ సంకల్పించుచున్నాఁడు గనుక కవి గోపికాస్త్రీ శృంగారచేష్టాయుతమైన మంగళశ్లోకముతో కావ్యారంభము చేసినాఁడు. 'స్వయంగ్రహపరిష్వంగేషు' అనుటచే, శ్రీకృష్ణునియొక్క భువనమోహనత్వము, గోపికల గాఢానురాగతత్త్వము వ్యక్తమగుచున్నవి. శ్రీకృష్ణుఁడని నేరుగా చెప్పక, 'వేణునాదరసికః', 'జాగరజాతనయనద్వన్ద్వః' అని చెప్పుటచే, భాగవతములో చెప్పఁబడినరీతిగా వేణు గానప్రభావితలైన గోపికలు, వారి అవిరతసాంగత్యములు స్ఫురించుచున్నవి. అందుచేతనే అతఁడు 'జాగర జాతనయనద్వన్ద్వుఁ'డైనాఁడు. 'స్వయం తుష్టః పరాన్ తోషయతి' అను నానుడి ప్రకారము ఇట్లు గోపికా సాంగత్యముచే సంతుష్టుఁ డైన శ్రీకృష్ణుఁడు కావ్యపఠితలను గూడ సంతుష్టులను జేయఁగలడని కవియొక్క ఆశయము.

**శ్లో||** **భువనవిదితమాసీద్యచ్చరిత్రం విచిత్రం**
**సహ యువతిసహస్రైః క్రీడతో నన్దసూనోః**
**తదఖిలమవలమ్బ్య స్వాదు శృఙ్గారకావ్యం**
**రచయితుమనసో మే శారదాऽస్తు ప్రసన్నా||** ౨

**ఉ.** **వేనకువేలగుబ్బెతల వేడుకఁ గూడి రమించు శౌరిచి**
**త్రానఘచారితంబు ప్రథితంబు జగంబున, దానిఁ గొంచు నే**
**నూనెద నొక్క యుజ్జ్వలరసోత్కటకావ్యము సేయ, శారదా**
**నూనకృపాకటాక్షమధునుత్తకవిత్వకళాధురీణతన్.** ౨

**అర్థము:** యువతిసహస్రైః సహ=పెక్కండ్రు యువతులఁ గూడి, క్రీడతః=క్రీడించుచున్న, నన్దసూనోః= నందుని పుత్త్రుఁడైన శ్రీకృష్ణునియొక్క, విచిత్రం=వింతయైన, యత్ చరిత్రం=ఏ చరిత్రము, భువనవిదితమ్= లోకప్రసిద్ధము, ఆసీత్=ఐనదో, తత్ అఖిలమ్=అది యంతయు, అవలమ్బ్య=ఆధారముగాఁ జేసికొని, స్వాదు=మనోహరమైన, శృఙ్గారకావ్యం= శృంగారరసప్రధానమైన కావ్యమును, రచయితుమనసః= రచింప సంకల్పించిన, మే=నాకు, శారదా= సరస్వతీదేవి, ప్రసన్నా అస్తు= అనుగ్రహముగలది యగుఁ గాక. (పైన 'శృఙ్గారకావ్యం' అను పదము 'ఉజ్జ్వలరసోత్కటకావ్యము'గా అనూదితమైనది.